నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 2 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## రెడ్డికాలనీ పార్కును పరిరక్షించండి



మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, వైస్ చైర్మన్ మహేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ సంజీవ్

మంచిర్యాల ఏసీసీ, మార్చి 1 : మంచిర్యాల మున్సిపాలిటీలోని 24వ వార్డు పరిధిలోగల రెడ్డి కాలనీ పార్కును పరిరక్షించాలని కౌన్సిలర్ వేములపల్లి సంజీవ్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల 'పట్టణ ప్రగతి' నిధులు రూ.40 లక్షలతో పార్కు నిర్మాణం చేపట్టి, ప్రారంభినట్లు తెలిపారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో పార్కులోని పిల్లల ఆట వస్తువులు, జిమ్ పరికరాలు, గ్రీనరీ పాడైపోయాయని పేర్కొన్నారు.


## మంచిర్యాల డీసీపీ కేకన్ సుధీర్ రాంనాథ్ బదిలీ

- కొత్త డీసీపీగా అశోక్‌కుమార్

మంచిర్యాల ఏసీసీ, మార్చి 1 : మంచిర్యాల డీసీపీ కేకన్ సుధీర్ రాంనాథ్ మహబూబాబాద్ ఎస్పీగా బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. జయశంకర్ భూపాలపల్లి ఓఎస్డీగా విధులు నిర్వహిస్తున్న అశోక్‌కుమార్‌ను మంచిర్యాల డీసీపీగా నియమించారు.

## నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

కాసిపేట, మార్చి 1 : కాసిపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య తెలిపారు. 6వ తరగతిలో వంద సీట్లు, 7,8,9,10 తరగతలో ఖాళీగా ఉన్న సీట్లకు అడ్మిషన్ల కోసం మార్చి 2వ తేదీ చివరి అవకాశమని, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్యా బోధన ఉచితంగా ఉంటుందని, అన్ని రకాల సదుపాయాలు, వసతులు ఉంటాయని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాచారం కోసం 9550932264 నంబర్‌ను సంప్రదించవచ్చని వివరించారు.



మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, తదితరులు



అన్నారం ప్రాజెక్టును పరిశీలిస్తున్న కేటీఆర్



మేడిగడ్డకు చేరుకున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, కౌశిక్ రెడ్డి, తదితరులు

కాళేశ్వరం ప్రాజెక్టు యాత్రలో బీఆర్‌ఎస్ నేతలు కడియం, కేటీఆర్, హరీశ్

### కేసీఆర్‌పై కోపంతో..

# రైతులపై పగబట్టకండి

- మేడిగడ్డకు మరమ్మతులు చేయించి.. నీళ్లను లిఫ్ట్ చేయండి
- 3 పిల్లర్లకు సమస్య వస్తే.. కాళేశ్వరం మొత్తం నష్టపోయిందని బద్నాం చేస్తున్నరు
- రైతులకు కామధేనువు లాంటిది కాళేశ్వరం

'కాళేశ్వరం ప్రాజెక్టు రైతులకు కామధేనువు. అటువంటి కాళేశ్వరాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయండి. నీళ్లను వెంటనే లిఫ్ట్ చేసి రైతులకు అందించండి. నల్లగొండ సభలో కేసీఆర్ ఇచ్చిన మాట మేరకు బీఆర్‌ఎస్ నేతలమంతా మేడిగడ్డకు వచ్చాం. ప్రాజెక్టు రక్షణ చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వమే గోబెల్స్ ప్రచారం నిర్వహిస్తున్నది. దాన్ని అడ్డుకుని ప్రజలకు వాస్తవాలు వివరించేందుకే ఇక్కడికి వచ్చాం. 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 21 పంపింగ్ స్టేషన్లు, 273 కిలోమీటర్ల పొడవైన టన్నెల్స్, 1500 కిలోమీటర్లకు పైగా ఉండే కాలువలు కలిగిన భారీ ప్రాజెక్టు కాళేశ్వరంలో కేవలం మేడిగడ్డ బ్యారేజీలో 3 పిల్లర్లకు సమస్యలు వస్తే రాద్ధాంతం చేస్తున్నారు' అని బీఆర్‌ఎస్ నేతలు ప్రభుత్వ వైఖరిని తూర్పారబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న దుష్ప్రచారంపై వాస్తవాలు ప్రజలకు తెలియజెప్పేందుకు బీఆర్‌ఎస్ నేతలు శుక్రవారం చేపట్టిన చలో కాళేశ్వరంలో భాగంగా ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, కడియం శ్రీహరి మాట్లాడారు. కేసీఆర్‌పై కోపముంటే ఆ కోపాన్ని దయచేసి రైతులపై రాష్ట్రంపై చూపవద్దని వారు కోరారు. ఆలస్యం చేయకుండా మేడిగడ్డకు మరమ్మతులు చేయించి రైతులకు సకాలంలో నీళ్లు అందేలా చూడాలని చెప్పారు.



మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, తదితరులు



మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ నామ నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, తదితరులు



ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, గండ్ర వెంకటరమణా రెడ్డి, మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్, దేవిప్రసాద్, తదితరులు



మేడిగడ్డ వద్ద కేటీఆర్, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, గంగుల కమలాకర్, తదితరులు

## భూ సమస్యల పరిష్కారానికి కృషి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, మార్చి 1 : ధరణిలో నమోదైన భూ దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణతో కలిసి తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 9వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల అధికారులు తమ పరిధిలో నమోదైన భూ దరఖాస్తులు, ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. 18 మండలాల్లోని ప్రతి తహసీల్దార్ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు దరఖాస్తు సమయంలో జతపర్చిన దస్తావేజులు, సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలిస్తాయని తెలిపారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ధరణిలోని వివిధ మాడ్యూల్స్ గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

## ఐజీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు



పోలీసు అధికారులతో శ్రీనివాసులు

మంచిర్యాల ఏసీసీ, మార్చి 1 : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు శుక్రవారం ఐజీగా బాధ్యతలు స్వీకరించారు. గత నెల 14న డీఐజీ హోదాలో బాధ్యతలు స్వీకరించిన ఆయన, ప్రస్తుతం తన కార్యాలయంలో ఐజీగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కమిషనరేట్‌లో సాయుధ పోలీసుల గౌరవాన్ని స్వీకరించారు. అనంతరం పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# రైతులను పగ పడుతారా?

### బీఆర్‌ఎస్ పార్టీపై కోపంతో వారిపై కక్ష సాధించవద్దు

- కాళేశ్వరంపై పనిగట్టుకొని దుష్ప్రచారం చేయడం సరికాదు
- వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టండి
- 'చలో కాళేశ్వరం'లో బీఆర్‌ఎస్ నాయకులు

మంచిర్యాల, మార్చి 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ''కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో పడావుబడ్డ భూములన్నీ సస్యశ్యామలం అయ్యాయి. 15 రిజర్వాయర్లు, వేల కిలోమీటర్ల కాలువలు, వంద కిలోమీటర్ల సొరంగ మార్గాలు, నీటి ఎత్తిపోతలతో యావత్ ప్రపంచమే ఆశ్చర్యపోయేలా ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత కేసీఆర్ సర్కారుది. అలాంటి విశ్వఖ్యాతి పొందిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ పనిగట్టుకొని దుష్ప్రచారం చేయడం సరికాదు. మరమ్మతులు చేస్తే సరిపోతుందని నిపుణులు చెబుతున్నా పట్టించుకోకుండా రాజకీయాలు చేస్తున్నారు. వరదలు వచ్చేలోగా దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. కాళేశ్వరంపై ఆధారపడి పంటలు వేసిన రైతులు ఆగమైపోతున్నారు. బీఆర్‌ఎస్‌పై కోపంతో రైతులను పగ పడుతారా.' అని బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు చలో కాళేశ్వరం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఇతర ముఖ్యనాయకులు శుక్రవారం మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలించారు. ఇప్పటికైనా స్పందించకపోతే రైతుల ఆగ్రహానికి కాంగ్రెస్ పార్టీ గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు.



మేడిగడ్డ వద్ద నాయకులు..

### కాళేశ్వరంపై కావాలనే విష ప్రచారం



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో సాధ్యం కాని హామీలు ఇచ్చింది. వాటిని అమలు చేయకుండా జనం దృష్టిని మరల్చేందుకు కాళేశ్వరంపై అర్థంలేని ఆరోపణలు చేస్తుంది. తెలంగాణ ముఖ చిత్రాన్ని మార్చిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కావాలనే పని గట్టుకొని విషప్రచారం చేస్తున్నది. మేడిగడ్డలో చిన్న సమస్యను భూతద్దంలో పెట్టి పెద్దదిగా చూపిస్తున్నారు. బీఆర్‌ఎస్‌పై కోపముంటే రాజకీయంగా కొట్లాడాలి. కానీ లక్షలాది మంది రైతులను గోస పెట్టడం సరికాదు. మేడిగడ్డకు వెంటనే మరమ్మతులు చేసి తీరాలి. ఈ విషయంలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం. రైతులకు అండగా నిలుస్తాం. వానకాలంలోగా రిపేర్లు పూర్తి చేయాలనే డిమాండ్‌తో ముందుకెళ్తున్నాం. సాగు నీరు పక్కన పెడితే కనీసం తాగేందుకు కూడా నీరు దొరకని పరిస్థితి ఉంది. గోదావరిలో నీళ్లు లేక జిల్లాలో బోర్లు, బావుల్లోనూ నీరు అడుగంటింది. అనవసర రాద్ధాంతాలు మాని మేడిగడ్డకు మరమ్మతులు చేస్తే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదు. హాయిగా కాళేశ్వరం నీళ్లు ఎత్తి పోసుకునేటోళ్లం. ప్రాజెక్టుల విషయంలో రాజకీయాలు పక్కన పెట్టి రైతులు, ప్రజల గురించి ఆలోచించాలని కాంగ్రెస్ పార్టీకి విజ్ఞప్తి చేస్తున్నా.

**- బాల్క సుమన్, మాజీ ప్రభుత్వ విప్, బీఆర్‌ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు**



రీసెర్చ్ వివరాలను వెల్లడిస్తున్న స్రవంతి

## యాట్ల స్రవంతికి డాక్టరేట్



యాట్ల స్రవంతి

మంచిర్యాలటౌన్, మార్చి 1: కాకతీయ విశ్వ విద్యాలయ వృక్ష శాస్త్ర విభాగ పరిశోధకురాలు యాట్ల స్రవంతి డాక్టరేట్ అందుకున్నది. ఇటీవల కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య నర్సింహాచారి ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టర్ యాట్ల స్రవంతి 'ఇన్‌విట్రో క్లోనల్ ప్రొపగేషన్ అండ్ జెనెటిక్ ఫెడిలిటీ ఇన్ సెమికార్పస్ అనకార్డియమ్ ఎల్ . ఎఫ్' అనే అంశంపై విభాగ ఆచార్యులు ఎండీ ముస్తఫా పర్యవేక్షణలో తన రీసెర్చ్‌ను పూర్తిచేశారు. ఇటీవల నిర్వహించిన సెమినార్‌లో ఆమె రీసెర్చ్ వివరాలను వెల్లడించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని పిట్టల వాడకు చెందిన యాట్ల స్రవంతి అక్కడే ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో 10వ తరగతి పూర్తి చేసింది. కాకతీయ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్, సాయిరాం డిగ్రీ కాలేజీలో బీఎస్సీ బీజెడ్‌సీ, కరీంనగర్‌లోని ఎస్‌ఆర్‌ఎం కాలేజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. ప్రస్తుతం కాకతీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ పట్టా పొందారు. ఈ సందర్భంగా స్రవంతిని బోధన, బోధనేతర సిబ్బంది, కుటుంబ సభ్యులు అభినందించారు.

# గెలుపోటములు సహజం

- క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి
- ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్, మార్చి1 : ఆటల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీస్ సాయుధ బలగాలకు బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ విధుల్లో ఒత్తిడి నుంచి బయటపడడానికి, శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి క్రీడలు దోహదపడుతాయన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సీఐ రాణా ప్రతాప్, ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, ఆర్ఐఎం అంజన్న, ఆర్ఐ స్పెషల్ పార్టీ షేక్ నాగుల్ మీర, సిబ్బంది పాల్గొన్నారు.

**మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలి..**

మహిళలు తమ సమస్యలపై నిర్భయంగా ఫిర్యాదు చేయాలని ఎస్పీ సురేశ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్‌వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. చిన్న పిల్లల రక్షణ విషయంలో పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపడుతుందని, ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టా గ్రాం వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని, ఫొటోలు, వీడియోలు పోస్టుచేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైనప్పుడు 87126 70564, డయల్ 100 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.



సిబ్బందిని పరిచయం చేసుకొని బ్యాడ్మింటన్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్